# పనిమనిషి

ఆశ్చర్యమేమిటంటే నరిసింహం, మనిషి కెన్ని కష్టాలు రావచ్చునో, అన్నికష్టా లనుభవిస్తున్నప్పుడు, ఆదర్శప్రాయురాలైన భార్యగా ప్రవర్తించిన శకుంతల, కాలపరివర్తనలో మనః పరివర్తనపొంది, సమీపస్తుల కసహ్యా కారణ మైంది.

నరిసింహం ఆశ్చర్యపడ్డాడు. అప్పటిదా, ఇప్పటిదా తనభార్య సహజస్వరూపం? అతని కంతుపట్టలేదు.

ఇది తప్పక డబ్బుతోవచ్చిన మార్పే! ఒకరికి నయం చేసేవిషం మరొకర్ని చంపుతుంది! ఒకరికి ప్రాణమిచ్చే డబ్బు మరోర జీవాలు లాగేస్తుందా?

డబ్బు నిజంగా విషతుల్యమా?

గాంధీ ఉపవాసదీక్షనుగురించి అన్నమాటొక్కటి జ్ఞాపకం వచ్చిం దతనికి. డబ్బుకూడా ఒకవిధమైన శక్తి. సమర్ధుడిచేతులో అది ఎంతపనైనా చేస్తుంది, అసమర్ధుడి మీద, చేతకానిచేతలడి మాదిరిగా బెడిసికొడుతుంది. దుష్ప్రయోగ ఫలితం!

అయినా తను డబ్బు సంపాదిస్తుంటే తన భార్య అడావుడి పడవలసిన అగత్యంకూడా ఆట్టేలేదు,కాని--

నిజానికి, పాపం, శకుంతల తన కష్టాల్లో పాలుతీసుకున్న మనిషి. ఒక్క రవ్వయినా సణగకుండా! తన సుఖం ఎందుకు పంచుకోరాదు?

శకుంతలను నిర్బంధించ వద్దనుకున్నాడు నరిసింహం.

విజయలక్ష్మిని వశంచేసుకున్న వాళ్ళయొక్క కథ అనేకంగా వింటున్నాం. కాని వాళ్ళప్రకృతి వివరంగా ఎక్కడా చెప్పబడటంలేదు. ఆ కారణంచేత ఎవరో లక్షలు, కోట్లు సంపాదించా రనుకోవటమే కాని అవి మరొకళ్ళు సంపాదించాలంటే ఎట్లాఉండాలో స్పష్టంగా తెలుసుకోలేకుండా ఉన్నాం. నరిసింహం సంసారపక్షంగా విజయం పొందిన వాడికింద లెక్క. కాబట్టి అతని ప్రకృతినిగురించి తెలుసుకోవటం కొంతవరకు ఏ కొద్దిమందికైనా ఉపకారంగా ఉండకపోదు.

అనేక విషయాల్లో అతను నాజూకులేని మనిషి, ఈ వివిధకళల్లో అతనికి చెప్పుకోతగ్గ అభిరుచిలేదు. అనేకమంది అతనికి డబ్బుసంపాదనే పని అనుకునే వాళ్ళు. అతనికి దేన్నిగురించీ ఎవ్వరితోనూ అభిప్రాయ భేదంలేదు. అందరితోనూ మాట్లాడేవాడు, ఎవరితోనూ వాదించేవాడు కాదు, పోట్లాడేవాడు కాదు, పూసుకు తిరిగేవాడు కాదు,అతిగానైనా మాట్లాడేవాడు కాదు. ఇంకోళ్ళకాలం అతను వ్యర్థంచెయ్యటానికీ, తనకాలం ఇతరులు వ్యర్థంచెయ్యటానికీ కూడా తనకు విరామం లేదని స్పష్టంగా సూచించేవాడు. అతని కింకో విచిత్రమైన గుణంఉంది. అతనికి ఏపనిచేస్తే డబ్బులభిస్తే ఆ పనిలో అభిరుచి కలిగించుకునేవాడు. అతను ప్లీడరు వృత్తిలో ప్రవేశించేటప్పుడు కాఫీహోటళ్ళ మాదిరిగా, చుట్టలు బీడీల మాదిరిగా అవసరమైన ప్లీడర్లు ఊళ్ళో నలుగురైదుగురి కన్న లేరని గమనించి జూనియర్లకు ఫైలులేదని చూస్తూనే ఆవృత్తిలో దిగాడు; ఆ వృత్తిని చూస్తే తనకు గౌరవంలేదని మాటవరసకైనా ఎవరితోనూ అన్నపాపాన పోలేదు.

అతనికి ఆలోచనను గురించి ఆలోచించే దురభ్యాసం లేదు. అటువంటి అలవాటు కవులకూ కల్పనాకథలూ రాసేవాళ్ళకు కావాలి కాని డబ్బు సంపాదించేవాడి కక్కర్లేదు.

అతనిలో మెచ్చుకోవలసిం దేమిటంటే, బాలెన్స్-తూకం. అతను గడిచిన పదిసంవత్సరాల్లోనూ తూకం తప్పి—తలవంచుకోవలసిన పనిచేసి ఎరగడు. ఎంత ఉద్రేకమూ మొహాన ఒక్కరవ్వయినా కనపడనిచ్చేవాడు కాదు.

అతనిచేత డబ్బు ఖర్చుపెట్టించదలచిన వాళ్ళు అతన్ని ఏవిధంగానూ సమీపించలేక సంఘాని కంత అనవసరమైన మనిషి లేడన్నారు; అతనికి డబ్బిచ్చిపొయ్యే వాళ్ళు 'ఆ మహారాజున్నాడు కాబట్టే బతికిపోతు

న్నాం' అన్నారు—అతన్ని సమీపించలేకపోయినప్పటికీ! పార్టీలచేత అంతమాట అనిపించుకున్న జూనియరుకు ముందు ముందు చాలా లాభం ఉంది.

పాతికేళ్ళపైగా, నరిసింహం తండ్రిగారి కాలంలో వచ్చారు, నరిసింహంగారి ఆవరణలో చిన్న గుడిసె వేసుకుని ఒక శూద్రకుటుంబం ఉంది—రంగమ్మా, ఇద్దరు పిల్లలూ. రంగమ్మ పెద్దకొడుకు పొరుగూళ్ళో ఒక డాక్టరుగారి దగ్గిర నెల కెనిమిదిరూపాయలు తెచ్చుకుంటున్నాడు. వా డప్పు డప్పుడూ వస్తుండేవాడు. నరిసింహం తండ్రిగారు ఒంగోలు తాలూకా కరువు సమయంలో పారిపోయివచ్చిన ఈకుటుంబాన్ని చేరదీసి వాళ్ళకు కాస్త స్థలమూ కొంపా యిచ్చి, రంగమ్మ మొగుడికి కొంత డబ్బిచ్చి బతుకుతూ ఉండమన్నాడు. రంగమ్మ ఇంటివారికి అడ్డమైన చాకిరీచేసి ఒక్కపైసా అయినా తీసుకోక ఋణం తీర్చుకుంది చాతయినట్టుగా! కాని కొత్త ఋణానుబంధం ఏర్పడ్డది. నరిసింహం తల్లి అతని నెలల్లో పోయింది. నరిసింహానికి రంగమ్మే తల్లయింది—పొయ్యటానికీ పెట్టటానికీ తప్ప. పొయ్యటమూ పెట్టటమూ మాత్రమే మాతృత్వం అనుకునే వాళ్ళకు నరిసింహాన్ని పెంచినవాళ్ళు పాఠం నేర్పారు. నరిసింహం దుర్దినాల్లో అంతాజారారు. మొగుడుపోయి, దేముడంటి యజమాని, నరిసింహం తండ్రీ పోయి, అక్కడక్కడా పాచిపనిచేసుకు బతుకుతున్న రంగమ్మ అప్పుడప్పుడూ నరిసింహానికి పావలాకూ అర్థకూ సహాయపడ్డది!

శకుంతలకు అతిశయం ఎప్పుడొచ్చిందో ఎట్లా వచ్చిందో ఎవరూ గమనించలేదు. ఆవిడకు పనిమనుష్యులంటేనే అసహ్యం. రంగమ్మ తమచేత నియోగింపబడ్డ పనిమనిషి కాదని శకుంతల ఎరుగును. కాని తన భర్తవల్ల ఏదోరూపంగా ప్రతినెలా అయిదారు రూపాయలు ముట్టజెప్పించుకుంటూన్న నాటినించీ (టెక్నికల్ గా!) రంగమ్మ పనిమనిషి అయిపోయిందని శకుంతల తన్నుతాను నమ్మించుకుంది. తనకొడుకు, నెలలవాడు, రంగమ్మ చేతుల్లో ఉంటే నల్లబడుతున్నట్టుగా ఉండేవాడు; కల్మషం వాడిలో రంగమ్మ చేతుల యొక్క స్పర్శవల్ల ప్రవేశిస్తున్నట్టుండేది శకుంతల మనస్సుకు. ప్రతిరోజూ రంగమ్మచేత ఎత్తుకోబడే వాడూ ఎన్నడూ రంగమ్మస్పర్శ ఎరుగనివాడూ ఒకటిగానే ఉంటారా? పదేళ్ళలో పెద్దమార్పుండదా? ఇటువంటి వాటిల్లో మడి కొంత తప్పకుండా ఉండే ఉండాలి! కొంతకొంతమందిరాసే కథలలో జరిగినట్టు ఈ క్షుద్ర వెధవ తన చేతులలోనించి దానిదగ్గిరికి అట్లా పరిగెత్తటమేమిటి? మళ్ళీ దానిదగ్గిర్నించి తనదగ్గిరికి రమ్మంటే స్పష్టంగా ఉఁహూఁ అని తల ఊపటమేమిటి? తన పిల్లవాణ్ణి గురించి అన్నీ రంగమ్మకు కావాలి! అన్నీ తను చెయ్యాలి తను చెందాలి—రంగమ్మ! ఇంకేం, రంగమ్మకు మనమడులేని లోపమే తీరిపోయా! మనమణ్ణి ఇంతకన్న ఎక్కువ చేసుకునేదేముంది? 'అమ్మగారూ! అబ్బాయిగారికి నీళ్ళు పొయ్యాలేమండీ? నేను పొయ్యానా?' 'అమ్మగారూ! అబ్బాయిగారికి బోజనం పెట్టాలేమండీ కడుపేడుస్తుంది.'

శకుంతల రంగమ్మతో మెల్లిగా ప్రారంభించి పోట్లాడటం క్రమంగా హెచ్చించింది. తనకు రంగమ్మమీదగల అసహ్యం మొగుడి ముందు దాద్దామనైనా ప్రయత్నం చెయ్యలేదు.

అనుకోకుండా వచ్చింది శకుంతల అహంకారానికంత్యదశ.

ఒకరోజు పిల్లవాడి మెళ్ళో గొలుసులేదు. అంతకుముందు రంగమ్మే ఆడిస్తున్నది పిల్లవాణ్ణి. శకుంతల రంగమ్మను ముందూ వెనకా చూడకుండా అనుమానించింది. మాటకూడా రానంత కోపంతో రంగమ్మ గుడిసె దగ్గిరికిపోయి పిల్లవాడి గొలుసు, దొంగిలించినది, ఇచ్చెయ్యమంది యజమానురాలు. రంగమ్మ తను గొలుసెరగనంది. కథలలో జరిగే గుడిసెలసోదాలూ, నగ లక్కడ కనిపించకపోవటం శకుంతలకు జ్ఞాపకంరాలేదు. ఆవేశ చరాచరా లోపలికిపోయి సోదా ప్రారంభించింది. ఎంతో సోదా అవసరం లేకపోయింది. బియ్యపు చాటలో సగంబియ్యం అడుగునా, సగం పైకి కనపడే

లొట్టా గొలుసు మెరుస్తున్నది. దీని కేమంటా వన్నది శకుంతల. రంగమ్మ అవమానంతో తల వంచుకోలేదు. నా కేమీ తెలీదు పొండన్నది. శకుంతల రంగమ్మను తక్షణం బయటికి నడవమన్నది రంగమ్మ సరేనని తట్టా బుట్టా బయట పడేస్తుండగా బజారువెళ్ళిన నరసింహం వచ్చాడు. సంగతంతా కనుక్కున్నాడు. ఆతనికి నవ్వాగ లేదు. శకుంతలకు ఒకవిధమైన భయం కలిగింది.

ఆత నెంత చెప్పినా పోతానని రంగమ్మ భీష్మించింది. నరసింహం భార్యతో రంగమ్మను పోవద్దని బతిమాలమని లోపలికి వెళ్ళిపోయినాడు. శకుంతల ఎట్లా అర్థంచేసుకుందో, వేరే బతిమాలటంలేకుండా క్షమాపణే ఇచ్చింది రంగమ్మకు!

—కొడవటిగంటి కుటుంబరావు.

# ఆవేదన

౧

అదె కనుంగొను మాంధ్ర జననీ
వదనమున కన్నీటిధారలు
తెలుఁగుఁదేశము వీఁగిపోయిన
తెఱఁగుఁదోఁపించుచుఁ ॥

౨

కడుపు లాఁకలితోడ మాఁడఁగ
ఎడఁదలో నుత్సాహ మింకఁగ
దీనులై యున్నారలదె, నా
తెలుఁగు సోదరులు ।

౩

నా పురాతేజమ్ము వమ్మై
నాఁటిస్వాతంత్ర్యాలు మన్నై
దైన్యగీతలు, దాస్యరేఖలు
దక్కెనా నేఁడు ॥

౪

భరతవర్ష శ్రీలకెల్లను
బట్టుగొమ్మలు భ్రాతృజాతులు ;
చెదరి నానామతములను వి
చ్ఛిన్నులైనారు ॥

౫

వాడు హృదయములోన సోదర
భావమింతకునైనఁ దోఁపదు
వజ్రకఠినపుగుండెలా, ఎటు
వచ్చు స్వాతంత్ర్యం ?

౬

ఈశ్వర ప్రతినిధులు ప్రాణులు
ఎఱుఁగవా? శ్రుతివిన్నఘనుఁడవు
వాని నెత్తురు కండ్లఁజూచిన
వచ్చునా సుఖము ?

౭

ఈ దురాచారాగ్ని శిఖలె
ఇంతవింతలు లేచినన్నె
ముద్దుఁగొనఁగా మోముమాఁడఁగ
మఱియుదువె నాఁడు ॥

౮

లలిత సారస్వతము శిల్పము
కలసి మనుపొందవ మహాన్నను
మిన్నుముట్టఁగఁజేసె ; నిపుడే
మున్నదీ మనకు ॥

౯

దేశభాషనుమఱచి నానా
దేశరీతుల మఱఁగి నా రూ
పము నెఱుంగని నను సహించునె
భారతీదేవి ।

౧౦

ఈ విషాద చరిత్రలో నిం
కెంతకాలము మగ్గియుండెద ?
ఆమహాత్ముని దివ్యపథమే
అనుగమించెదను ॥

—కొండూరు వీరరాఘవాచార్యులు.